క్లుప్తంగా

జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద ఆజాదీ కీ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐ జానకిరామ్, జీఎంఆర్ సిబ్బంది రాజేంద్రకుమార్, నాగకృష్ణ, ప్రవీణ్, త్రినాథ్, శ్రీనివాసరెడ్డి, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ రవీంద్రకు సత్కారం



పెనుగంచిప్రోలు: మండల ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన డి.రవీంద్రను గురువారం ఆయన కార్యాలయంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ స్వామి, ఎండీ జిలానీ, గౌరవాధ్యక్షులు ఎస్‌కే నజీర్, నాయకులు సీహెచ్ రామారావు, పాము నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చుతోందని సర్పంచి వేల్పుల సునీత అన్నారు. కంచికచర్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కంభంపాటి నాగరాజు కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10వేల నగదు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులమతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదంలో కాని, సహజ మరణం అయినా వైఎస్సార్ బీమా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీర్జావలి పాల్గొన్నారు.

మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు



కంచికచర్ల: కంచికచర్లలోని అన్ని వీధుల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహ్మద్ మీర్జావలి అన్నారు. స్థానిక సీఐ కార్యాలయం రోడ్డులో డ్రైనేజీలో గురువారం మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని వీధుల్లో మురుగునీరు పారుదల కోసం పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వర్షం కురుస్తున్న సమయంలో డ్రైనేజీల్లో చెత్తా చెదారం నిండి ఉండటంతో మురుగునీరు రోడ్లపైకి పారుతున్నాయని, వాటిని తక్షణమే తొలగిస్తున్నామన్నారు. రోడ్ల వెంబడి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని, దోమల నివారణకు ఎబేట్‌ను పిచికారీ చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక అధికారి సమీక్ష



చిల్లకల్లు (జగ్గయ్యపేట): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే, ఆ పథకం ఎందుకు అందడం లేదో తెలుసుకొని ఆ పథకం వచ్చేలా దరఖాస్తు కూడా ఆ లబ్ధిదారుతోనే చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలాజీ కుమార్, తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓ చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాన్యుడి ముఖంలో చిరునవ్వులు చూసేందుకే...

- జగనన్న సురక్షపై అధికారులతో ప్రత్యేక సమావేశం
- సూచనలు చేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్



జగనన్న సురక్ష ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: సామాన్యుడి ముఖంలో చిరునవ్వులు చూడటమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి నాలుగు మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి నందిగామను జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ప్రతి ఒక్క పౌరునికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలనే సమున్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన వారు పని పూర్తి చేసుకుని సంతోషంగా తిరిగి వెళ్లేలా అధికారులు కృషి చేయాలని అరుణకుమార్ అన్నారు. ఏ గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించేది ముందుగానే ఆ గ్రామ ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నెల రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు సంబంధించిన పత్రాలు, సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకవేళ ఎవరి సమస్యనైనా తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరించారనేది ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు.

వలంటీర్లకు అవగాహన కలిగించాలి

జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు వలంటీర్లకు అవగాహన కలిగించాలని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. ప్రతి వలంటీర్, గృహసారథి ప్రతిపాదిత కుటుంబాలకు వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరించి సమస్యలపై, ప్రభుత్వ పథకాలపైన ఫిర్యాదులను స్వీకరించి తగిన పత్రాలతో సచివాలయంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల నూరు శాతం అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించటంతో పాటు ప్రజలకు అవసరమైన పత్రాల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతారని తెలిపారు. సురక్ష కార్యక్రమంలో అధికారుల పని తీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వహణకు సంబంధించి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధి ప్రత్యేక అధికారి నాగమణి, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణిశ్రీనివాస్, తహసీల్దార్లు నరసింహారావు, రమేష్, సుశీలాదేవి, ఆశయ్య నాయక్, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, బాలశంకర్‌రావు, జ్యోతి, అరుంధతీ దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి సరికొత్త నిర్వచనం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



బోడవాడ గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సంక్షేమ పథకాల ద్వారా అట్టడుగు వర్గాల ప్రజల అవసరాలను తీర్చి సామాజిక న్యాయానికి సరికొత్త నిర్వచనం ఇచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని బోడవాడ గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల అమలు తేదీ క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అట్టడుగు వర్గాల ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలిచి సంపూర్ణ మద్దతు పలకాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ శీలం సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, వైఎస్సార్‌సీపీ నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, యాదాల దాసు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహాల్లో వ్యర్థాలను కాలువల్లో పడవేయవద్దు



మేజర్ డ్రెయిన్ పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని గృహాలు, దుకాణాల్లో ఉపయోగించిన వ్యర్థాలను కాలువల్లో పడవేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా వాహనాలలో వేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని మేజర్ డ్రైన్ పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర చొరవతో మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించి పట్టణంలోని మేజర్ డ్రెయిన్ ప్రాంతాలైన విజయవాడ రోడ్‌లోని కృష్ణుడు గుడి ప్రాంతం, ముక్త్యాల రోడ్, విలియంపేట, బలుసుపాడు రోడ్, కోదాడ రోడ్‌లలో ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతోనే భారీగా చేరికలు



పార్టీలో చేరిన తాళ్లూరి శివను కండువా కప్పి ఆహ్వానిస్తున్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేటఅర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసా తోనే పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వలసలుగా వస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని 16 వ వార్డు చెరువు బజారుకు చెందిన టీడీపీ స్థానిక నాయకుడు తాళ్లూరి శివ టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తన్నీరు నాగమణి నాగేంద్ర, స్థానిక నాయకులు ఎల్ఎస్.సుబ్బారావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, చింతల కోటేశ్వరరావు, తాళ్లూరి పుల్లయ్య, సతీష్, ఓర్సు చిన్నా పాల్గొన్నారు.

కౌలు రైతు లందరూ సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): కౌలు రైతులందరూ తప్పకుండా పంట సాగు హక్కుదారుల పత్రం(సీసీఆర్‌సీ) కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.వరలక్ష్మి అన్నారు. గ్రామంలో గురువారం సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డు తీసుకోవటం వలన ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల పథకాలు అందుతాయన్నారు. భూయజమానులు కూడా కౌలుదారులకు కౌలు కార్డు ఇవ్వటానికి సహకరించాలన్నారు. కౌలు రైతుకు కేవలం పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండదన్నారు. ఈనెల 30న కార్డులపై మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మోగులూరు(కంచికచర్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని మోగులూరు ఎంపీపీ స్కూల్ ఆవరణలో జగనన్న సురక్ష పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అర్హులైన లబ్ధిదారులకు అందజేయటమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటింటి జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయటం ద్వారా వచ్చే నెల 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు అవసరమైన పత్రాలు, గ్రామ సచివాలయాల్లోనే అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కనగాల రవికుమార్, సుబ్రహ్మణ్యం, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితం అంధకారం

కంచికచర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని దక్కించుకుంటారని, లేకపోతే జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడతాయని నవజీవన్ బాలభవన్ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ మేరుగ రత్నం అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని పరిటాల, గొట్టుముక్కల, కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తుపదార్థాలు, అసభ్యకరమైన సినిమాలు, ఇంటర్నెట్ వంటి వాటికి ఆకర్షితులయి అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ముందుగా విద్యార్థులకు సే నో టూ డ్రగ్స్ అనే అంశంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శర్మ, రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు భవానీపురంలోని రజా మసీదు వద్ద వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 'హర్ దిల్ మే వైఎస్సార్ - హమ్ సబ్ జగన్‌కీ సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీదులో 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, స్థానిక ముస్లింలతో కలిసి మగ్రిబ్ నమాజ్‌ను ఆచరించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా గత నాలుగేళ్లలో ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేసిన కృషిని గణాంకాలతో వివరించారు. నవరత్నాల పథకం ద్వారా ప్రభుత్వం కోట్లాది రూపాయలను ముస్లిం మైనార్టీలకు ఖర్చు చేసిందన్నారు. మతతత్వ శక్తులు పెట్రేగిపోతున్న తరుణంలో మైనార్టీల పక్షపాతి అయిన సీఎం జగన్ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మసీదు వద్దగల సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, షేక్ బాజీ షహీద్, షేక్ ఇక్బాల్‌తోపాటు మసీదు ముతవలి షేక్ ఫరీద్, సెక్రటరీ ఎండీ ఇర్ఫాన్, రసూల్ ఖాన్, ఇస్మాయిల్, మసీదు ఇమామ్ హాజీ గౌహర్ ఆలం సాహెబ్, మౌజాన్ హసన్ రజా తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో భారీ వర్షం



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కూలిన మహావృక్షం



పాత బస్టాండ్ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన నిలిచిన వర్షపు నీటిలో వాహనాలు

నందిగామ: సూర్య ప్రతాపంతో అల్లాడుతున్న ప్రజలపై వరుణుడు కరుణ చూపాడు. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గంటకు పైగా కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఎప్పుడు వర్షం పడుతుందా, ఎప్పుడు వాతావరణం చల్లబడుతుందా అని ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. ఉన్నట్టుండి మధ్యాహ్నం 2.25 గంటల సమయంలో ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. 65వ నంబరు జాతీయ రహదారిపై స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో దాదాపు అడుగు మేర నీరు నిలిచింది. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఈదురు గాలులకు కుప్ప కూలిన భారీ వృక్షాలు

భారీ వర్షానికి తోడు ఈదురుగాలుల బీభత్సానికి పలుచోట్ల భారీ వృక్షాలు కుప్పకూలాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గల దాదాపు 127 సంవత్సరాల నాటి భారీ వేప చెట్టు ఈదురు గాలులకు పడిపోయింది. పట్టణంలోని మయూరి టాకీస్ ప్రాంతం, చందాపురం రోడ్డు, పాత బస్టాండ్, మధిర రోడ్డు ప్రాంతాల్లో పలు వృక్షాలు కూలిపోగా మరికొన్ని వృక్షాల కొమ్మలు విరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ శాఖ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారికి పలువురు భక్తులు సారెను సమర్పించారు. విజయవాడ నగరానికి చెందిన పలువురు భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా, వారిని ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందచేశారు.

రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన

- ఎత్తిపోతల పథకానికి కొత్త మోటార్లు
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వి.అన్నవరం(వీరులపాడు): రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వి.అన్నవరం గ్రామంలోని ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన మోటార్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సాగు నీరు అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చివరి ఆయకట్టు రైతుల పంట పొలాలకు సైతం సాగు నీరు పుష్కలంగా అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో ఎత్తిపోతల పథకం ఉన్నా మోటార్లు పని చేయక రైతులకు మాత్రం సాగు నీరు అందటం లేదన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. కొత్త మోటార్లు ఏర్పాటు చేయటమే కాకుండా మూడు మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం ఎత్తిపోతల పథకం చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన వల్లాపూరి నవీన్‌కుమార్, బోయపాటి సుబ్బారావులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ జమ్ముల వరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జమ్ముల శేషగిరి, జమ్ముల వెంకటేశ్వరరావు, వల్లాపూరి రామకోటేశ్వరరావు, తోట నారాయణ, చెండ్యాల రామకృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

హుండీ కానుకల ద్వారా వెంకన్నకు రూ.30 లక్షల ఆదాయం

తిరుమలగిరి (జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.30,21,471 ఆదాయం సమకూరిందని ఆలయ ఏసీ ఎంకేటీఎన్ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. మూడు నెలల కాలంలోనే ఈ ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. కార్యక్రమంలో దేవాలయం ఇన్‌స్పెక్టర్ హరి గోపీనాథ్ ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా నాగమణమ్మ

నందిగామ: మండల ప్రత్యేక అధికారిగా ఎస్.నాగ మణమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా ప్రభుత్వం నియమించింది.ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగ మణమ్మ నందిగామ మండల ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పెనుగంచిప్రోలు: బడిఈడు పిల్లలు ఎవరూ బయట ఉండకూడదని, ఎవరైనా ఉంటే వెంటనే పాఠశాలలో చేర్పుకోవాలని ఎంఈఓ రవీంద్ర ఆదేశించారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ పాఠశాలలకు హాజరు కావాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు అందరికీ అందించటంతో పాటు, జగనన్న గోరుముద్ద కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ డైరీ రాయాలని, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌ఏ ఏఈ ప్రసాద్, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



జగ్గయ్యపేటలో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో గురువారం పలు మెడికల్ షాపులలో డ్రగ్స్ అండ్ విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. పట్టణంలోని 8 మెడికల్ షాపుల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేరని, గడువు దాటిపోయిన మందులు విక్రయిస్తున్నారని, నాసిరకం మందులు, అన్ వాంటెడ్(ప్రమాదకరమైన) మందులు విక్రయిస్తున్నారని, అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారని పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ముండ్లపాటి ప్రభాకర్ అనే వ్యక్తి జిల్లా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి ఇ.సాంబశివరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ పలు మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేరని, తాము చేసిన తనిఖీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, అనంతరం తదుపరి చర్యలు ఉంటాయన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్, గుడివాడకు చెందిన సీనియర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ జి.బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డీఐఓ విచారణ

పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం వైద్యశాఖ డీఐఓ పీజే అమృతం విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన టి.వీరబాబు అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ జరిగింది. ఏప్రిల్ నెలలో ఆసుపత్రికి రోగిని తీసుకు వస్తే పరీక్షించేందుకు ఎవరూ అందుబాటులో లేరని అతను ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడు మాట్లాడుతూ తమకు వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, వైద్యులను మార్చాలని అధికారితో తెలిపామన్నారు. విచారణకు వచ్చిన ఫిర్యాదుదారుడుతో పాటు, వైద్యులు, సిబ్బంది నుంచి డీఐఓ లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పదేపదే వస్తున్న ఆరోపణల విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పట్టణంలోని ఐదవ వార్డులో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట వార్డ్ ఇంచార్జ్ నల్లమల్లి మురళి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.